క్లుప్తంగా

భాగ్యనగరం పాఠశాలకు క్రీడా ప్రతిభా పురస్కారం



హెచ్‌ఎం, పీడీలను సన్మానిస్తున్న గ్రామస్తులు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం ఉన్నత పాఠశాలకు వరుసగా మూడోసారి క్రీడా ప్రతిభా పురస్కారం లభించింది. ఈనెల 29న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించిన క్రీడాదినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీఈఓ సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా హెచ్‌ఎం ఆదిలక్ష్మమ్మ, పీడీ శ్రీధర్ పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామస్తులు కొత్తపల్లి సురేంద్ర, చవ్వ అమరసింహారెడ్డి శాలువా, పూల మాలతో హెచ్‌ఎం, పీడీని ఘనంగా సత్కరించారు. తమ ఊరి పాఠశాలకు వరుసగా మూడో సారి క్రీడా ప్రతిభా పురష్కారం రావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులేసు, గంగాధర్, నాగరాజు, సురేష్‌బాబు, లక్ష్మీఈశ్వరమ్మ, వహిదా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



గ్యారేజీ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

నంద్యాల(వ్యవసాయం): ప్రభుత్వ తీరుపై నంద్యాల ఆర్టీసీ డిపో ఎదుట ఎస్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిపో కార్యదర్శి సుబ్బరాజు, నాయకులు యోగారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన అలవెన్స్‌లు, అరియర్స్ బిల్లుల విషయంలో ప్రభుత్వ తీరు సరికాదన్నారు. ఉద్యోగులకు ఇబ్బంది కలిగిస్తే ఆందోళన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చౌరెడ్డి, సుబ్బారావు, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆబాలగోపాలానికి ఇష్టదైవం

శ్రీశైలంటెంపుల్: వినాయకునిగా, గణపతిగా, ఏకదంతుడుగా, వక్రతుండునిగా పలు నామాలతో పూజలందుకునే గజాననుడు ఆబాలగోపాలానికి ఇష్టదైవమని ప్రముఖ ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గణపతి గాథలు ప్రవచనాలు ఏడవ రోజు శుక్రవారం కొనసాగాయి. సామవేదం షణ్ముఖశర్మ మాట్లాడుతూ గణపతిని జ్యేష్ఠరాజు అని వేదం కీర్తించిందన్నారు. గొప్పవారిని జ్యేష్ఠులు అంటారని, అలాంటి మహనీయులలో అత్యంత శ్రేష్ఠుడిగా స్తుతించబడుతున్న గణపతిని జ్యేష్ఠరాజుగా పేర్కొన్నారన్నారు. గణపతికి నవరాత్రోత్సవాలను జరపడం సంప్రదాయమన్నారు. నవసంఖ్య పూర్ణత్వానికి సంకేతం కనుక ఒక దేవతాశక్తిని సంపూర్ణంగా గ్రహించేందుకే తొమ్మిదినాళ్ల ఉత్సవాలను చేపట్టడం ఆచారంగా మారిందన్నారు. అలాగే సందర్భానుసారంగా శ్రీశైల క్షేత్ర మహిమాన్విత విశేషాలను వివరించారు. స్వామివారి ఆలయంలోని రత్నగర్భ గణపతిని చింతామణి గణపతిగా కూడా పేర్కొన్నారని, ఈ గణపతిని దర్శిస్తే కోరికలన్నీ నెరవేరుతాయన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



డ్రమ్ములో నిల్వ ఉంచిన నీటిని పరిశీలిస్తున్న కామేశ్వరరావు

నంద్యాల(అర్బన్): ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి కామేశ్వరరావు అన్నారు. డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చాపిరేవుల గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమ కాటు వల్ల కలుగుతుందన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

1, 2 తేదీల్లో ఆల్ ఇండియా మహాసభలు

నంద్యాల(న్యూటౌన్): సెప్టెంబర్ 1, 2 తేదీల్లో మహారాష్ట్రలోని పూణే నగరంలో ఐఎఫ్‌టీయూ 8వ ఆల్ ఇండియా మహాసభలు జరుగనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజిత్, మహబూబ్‌బాషా తెలిపారు. ఈ సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం స్థానిక కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను, అసంఘటిత కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టాలకు వత్తాసు పలుకుతూ కార్మిక వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరు గార్చుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఖాజా, అప్సన్, మగ్బుల్, రవి, జుబేర్‌ఖాజాపీర్, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించితే నష్టమే!

- వరిలో ఎరువుల యాజమాన్యం కీలకం
- అవసరం మేరకు వినియోగిస్తే మంచి ఫలితాలు
- జిల్లాలో 65,787 హెక్టార్లలో వరి సాధారణ విస్తీర్ణం
- సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలంటున్న శాస్త్రవేత్తలు



గోస్పాడు: జిల్లాలో ప్రస్తుతం వరిసాగు జోరుగా సాగుతోంది. ఈ పంట సాగులో ఎరువుల యాజమాన్యం చాలా కీలకం. భూసార పరీక్షల ఆధారంగా నేల పరిస్థితిని బట్టి ఎరువులను అవసరం మేర వినియోగిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. మితిమీరిన ఎరువుల వినియోగంతో ఆరోగ్యంతో పాటు ఆశించిన దిగుబడులు కూడా కోల్పోయే ప్రమాదముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరిలో అధిక దిగుబడుల సాధనకు రైతులు ఎరువుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

జిల్లాలో 60వేల హెక్టార్లలో వరి సాగు...

జిల్లాలో ఈ ఏడాది వరి సాగుకు 65,787 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా దాదాపు 60 వేల హెక్టార్ల వరకు సాగు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు తోడు ఈ ఏడాది కాలువలకు నీరు కూడా వదిలారు. ఫలితంగా రైతులు నారుమడులను సిద్ధం చేశారు. కొన్ని చోట్ల వరినాట్లు సైతం జోరందుకున్నాయి. జిల్లా పరిధిలో ఇప్పటికే దాదాపుగా 80 శాతం విస్తీర్ణంలో నాట్లు వేసినట్లు అధికారుల అంచనా. ముందుగా నాట్లు వేసిన రైతులు ఒక పక్క పంట ఏపుగా ఎదగడానికి, మరోపక్క తెగుళ్ల, కలుపు నివారణకు ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరి సాగులో యూరియా, డీఏపీతో పాటు పొటాష్‌ను తగిన మోతాదులో వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ప్రధాన ఎరువుల వినియోగం ఇలా..

ఎకర పొలానికి 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తరువాత నాలుగు కేజీల డీఏపీ, రెండు కేజీల యూరియా, కేజీ పొటాష్ కలిపి వేస్తే ఆకు ఏపుగా ఎదుగుతుంది. ప్రధాన పొలంలో మొదటి దమ్ములో ఎకరాకు 10 కిలోల జింకు సల్ఫేట్ వేసుకోవాలి. నాటుకు ముందు దమ్ములో ఎకరాకు 75 కిలోల డీఏపీ, 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేసుకోవాలి. తదుపరి దుబ్బులు వచ్చే దశలో 45 కిలోల యూరియా, చివరగా అంకురం దశలో 45 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ ఎరువులు వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి. పైరు సాగుకు ముందు తొలకరిలో జీలుగ, జనుము, పిల్లిపెసర, నవధాన్యాలు వేసుకున్నట్లు అయితే సిఫార్సు చేసిన ఎరువు, మందుల్లో 15 నుంచి 20 శాతం తగ్గించి వాడుకోవచ్చు. అలాగే జీవన ఎరువులు అయిన అజోష్, పైరిల్లాం, పాస్ఫోబ్యాక్టీరియాలను ఎకరాకు కిలో వంతున 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి చల్లుకున్నట్లు అయితే సిఫార్సు చేసిన ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చు.

ఫొటాష్ లోపంతో ప్రమాదం..

సాధారణంగా రైతులు వరిసాగులో యూరియా, డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాష్ వినియోగంపై ఆసక్తి చూపరు. దీంతో పొటాష్ లోపంతో పైరుకు చీడపీడలు సోకి గింజ గుల్లబారి బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి సాగులో పొటాష్ వినియోగంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పొటాష్ వినియోగాన్ని పట్టించుకోకపోతే భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

సేంద్రియ ఎరువులతో మేలు...

తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు ఇచ్చే సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలి. మితిమీరిన రసాయనిక ఎరువుల వాడకంతో అనారోగ్య దిగుబడులతో పాటు నేల నిస్సారమైపోతుంది.

సేంద్రియ ఎరువులను విస్మరించొద్దు



వరి సాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. సేంద్రియ ఎరువులను రైతులు పూర్తిగా విస్మరిస్తున్నారు. దాని వల్ల భూమిలో జీవ చైతన్యం సన్నగిల్లిపోతుంది. ఈ నేపథ్యంలో రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువుల వాడకం పెరగాలి. పొలాన్ని సంవత్సరం పొడవునా ఏదో ఒక పైరుతో పచ్చగా ఉంచినట్లు అయితే సూక్ష్మజీవుల చర్యలు సంవృద్ధిగా ఉండి నేల ఆరోగ్యంగా ఉండటంతో పాటు పోషణ శక్తి బాగుంటుంది.

–దేసు బాలరాజు, సస్యరక్షణ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె

విన్నపం

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రకాష్‌ను కలిసి విన్నవించినట్లు సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. జిల్లాలో పలుచోట్ల పేదలు ఏళ్లతరబడిగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి రామకృష్ణతో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు శుక్రవాం ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఈరోజు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నిరంజన్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పింఛన్ల పంపిణీ

దొర్నిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం పింఛన్ల పంపిణీ చేపడుతున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే 3,730 మంది లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఏదైనా కారణాల చేత పింఛన్లు పొందని వారికి 2వ తేది సోమవారం ఇస్తామన్నారు. ఉదయం 6గంటల నుంచే పింఛన్ పంపిణీ ప్రారంభించాలని ఇప్పటికే సచివాలయ ఉద్యోగులకు ఆదేశించినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా ప్రతిష్టోత్సవం



ఏర్పాటుకు సిద్ధం చేసిన విగ్రహం, ధ్వజస్తంభం

రుద్రవరం: మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో మాధవస్వామి విగ్రహ,ధ్వజ ప్రతిష్టోత్సవ కార్యక్రమం శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. మొదటి రోజు వేద పండితులు ఆలయం వద్ద వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీ,మాధవస్వామి విగ్రహానికి, ధ్వజస్తంభాన్ని ట్రాక్టర్‌లోకి చేర్చి గ్రామోత్సవం చేశారు. గ్రామ పెద్దలు, దాతల సహకారంతో వివిధ దేవతా మూర్తులకు సంబంధించి ఐదు ఆలయాలు నిర్మించారు. ఇందులో మాధవస్వామి ఆలయం ఒకటి. అయితే, పురాతన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మించి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు ప్యాపిలి చిన్న నర్సయ్య తెలిపారు.

మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత



మొక్క నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా



నర్సాపురం పీహెచ్‌సీ ప్రాంగణంలో మొక్క నాటుతున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. శుక్రవారం వనం–మనం కార్యక్రమానికి సంబంధించిన ర్యాలీని మున్సిపల్ కార్యాలయం నుంచి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో పచ్చదనం పెంచి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అలాగే భావితరాల కోసం విరివిగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టిశ్రీధర్, పాంషావలి, సిబ్బంది ఉన్నారు.

పచ్చదనం పెంచాలి

రుద్రవరం: విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు అన్నారు.76వ వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని నర్సాపురం పీహెచ్‌సీ ప్రాంగణంలో సర్పంచు శాంతకుమారి, డాక్టర్ బాబు తదితరులతో కలిసి కానుగ, వేప, రేల, రావి వంటి మొక్కలు నాటి నీరు పోశారు. సెయింట్ మార్తోమ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, నర్సాపురం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో అటవీ విస్తీర్ణం 33 శాతం ఉండాల్సి ఉండగా 19 శాతం మాత్రమే ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో ఓబయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

బర్న్స్ ఉన్నత పాఠశాలలో ..

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఉన్న బర్న్స్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బర్న్స్ డైరెక్టర్ పాల్ రాజారావు ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఆవరణలో సుమారు 100 మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే మార్గమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సింధూర, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షంషీర్, ఉపాధ్యాయులు బర్నబస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం



వరినాటును పరిశీలిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ సలాం అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం కింద రైతు బాల మద్దిలేటి సాగు చేస్తున్న వరి పైరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు వనరుల కేంద్రంలో జీవ ఉత్ప్రేరకాలు, కషాయాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించేలా చూడాలన్నారు. రసాయన ఎరువులు, మందుల వాడకం ద్వారా భూమి సారవంతం కోల్పోవడంతో పాటు రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. అనంతరం ఆయన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు.





గుండుపాపల గ్రామంలో వాలిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్, క్రిష్టిపాడులో పూర్తిగా దెబ్బతిన్న ఓవర్ హెడ్‌ట్యాంక్

కూలేందుకు సిద్ధంగా...

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల, క్రిష్టిపాడు గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రమాదకరంగా మారాయి. గుండుపాపల గ్రామంలోని ట్యాంకు నుంచి గ్రామానికి మంచినీరు సరఫరా అవుతున్నప్పటికీ ఓవైపు వాలడంతో పాటు నీరు లీకవుతుంది. దీంతో ట్యాంకు ఎక్కడ కూలుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అలాగే క్రిష్టిపాడు గ్రామంలోని ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీనిని వెంటనే కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే రోజూ ఆ ట్యాంకు నుంచి పెచ్చులూడి పడుతున్నాయని, ప్రమాదం జరగకముందే దానిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ డైరీ

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని శ్రీనివాస కాంప్లెక్స్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు..శ్రీనివాస కాంప్లెక్స్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అక్కడ ఆరుగురు పేకాట ఆడుతుండగా అరెస్ట్ చేసి వారి నుంచి రూ.13,750 స్వాధీనం చేసుకున్నామన్నారు.

సంక్షిప్తం

1న ఉచిత కంటి వైద్య శిబిరం

శిరివెళ్ల: సెప్టంబర్ 1వ తేదీన స్థానిక శ్రీ వాణి విద్యా నికేతన్ ఆవరణలో ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు కండె ఆనంద్ శుక్రవారం తెలిపారు. నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ వైద్యశాల డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని, ప్రజలు సద్వినియోగ చేసుకోవాలన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నిక పూర్తి

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మనూరు ప్రాథమికోన్నత పాఠశాలలో యాజమాన్య విద్యాక మిటీచైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ఎట్టకేలకు శుక్రవారం జరిగింది. ఈ నెల 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. అయితే పెద్దయమ్మనూరు ప్రాథమికోన్నత పాఠశాలలో కోరం లేక రెండు సార్లు ఎన్నిక వాయిదా పడింది. ముచ్చటగా మూడోసారి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు ఎన్నికల అబ్జర్వర్ వీరప్రతాప్‌రెడ్డి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌గా చిన్నబాదుల్లా, వైస్‌చైర్మన్‌గా లక్ష్మీదేవిలను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. ఎంపికైన పాలకవర్గంతో ప్రధానోపాధ్యాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు.

రేపు రెడ్ల ఆత్మీయ సమావేశం

నంద్యాల(అర్బన్): ఉయ్యాలవాడలో ఆదివారం అఖిల భారత రెడ్ల ఐక్యవేదిక ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు రెడ్డి సంఘం సభ్యులు పట్నం సురేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి హాజరు కావాలంటూ ఎంపీ బైరెడ్డి శబరికి సంఘం సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రెడ్డి సంఘాల సభ్యులతో నిర్వహించబడే సమావేశానికి రెడ్ల కుటుంబ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

నంద్యాల(అర్బన్): మహానందిలో వెలసిన శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సనాతన హిందూ ధర్మ పరిరక్షకులు రాధా మనోహర్ దాస్ స్వామిజీ శుక్రవారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువుకు ఏఈఓ మధు, పురోహితులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): సెప్టెంబర్ 2, 3, 4, 5 తేదీల్లో అనంతపురం పట్టణంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం నంద్యాలని కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీ వేలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం శిక్షణ తరగతుల్లో భవిష్యత్తు కార్యచరణపై చర్చిస్తారన్నారు.

సెప్టిక్ ట్యాంకు గుంత పూడ్చారు



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సెప్టిక్ ట్యాంకు గుంతను పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దెబ్బతిన్న సెప్టిక్ ట్యాంకు గుంతకు మరమ్మతులు చేశారు. ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల దుస్థితిపై ఈ నెల 24న 'ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే' అనే శీర్షికతో సాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. దెబ్బతిన్న సెప్టిక్ ట్యాంకుతో పాటు అధ్వానంగా ఉన్న మరుగుదొడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు సమస్యకు పరిష్కారం లభించడంతో కార్యాలయ సిబ్బంది, మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గోస్పాడు: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దీబగుంట్ల హైస్కూల్ హెచ్‌ఎం నాగలక్ష్మి అన్నారు. ఆ స్కూల్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. జిల్లా స్థాయిలో మూడోస్థానంలో నిలిచి ఇటీవల క్రీడా పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించి హెచ్‌ఎం మాట్లాడారు. గత సంవత్సరంలో కూడా జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా అవార్డుల్లో తమ పాఠశాల 5వ స్థానంలో నిలిచిందన్నారు. పలువురు విద్యార్థులు విలువిద్య, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, ఫెన్సింగ్, యోగా, బాక్సింగ్, త్రోబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అలాగే రాష్ట్ర అండర్–17 ఫెన్సింగ్ సాబర్ బాలికల విభాగంలో దివ్యశ్రీ, వ్యక్తిగత టీం విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అండర్–17 బాలుర ఫెన్సింగ్ విభాగంలో లక్ష్మీనరసింహ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారన్నారు. ఫెన్సింగ్‌లో సాబర్ విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో అంజికుమార్ గోల్డ్ మెడల్ సాధించగా త్రోబాల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మహేష్ గోల్డ్ మెడల్, 65 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలో ఎన్.గణేష్ కాంస్య పతకాలు సాధించారన్నారు. తమ విద్యార్థులు క్రీడల్లో చక్కని ప్రతిభ కనబరిచేందుకు వ్యాయామ ఉపాధ్యాయుడు విశ్వనాథ్ ఎంతో కృషి చేశారన్నారు. అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి చేస్తా



చాగలమర్రి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

చాగలమర్రి: మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, ఇందుకోసం సీఎం చంద్రబాబు రూ.2.50 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. మండలంలో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. అంతకుముందు డి.వనిపెంట సర్పంచ్ బాలీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఓజి తండాలో తాగు నీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, గ్రామంలో ఓహెచ్ ట్యాంకు నిర్మించాలని విన్నవించారు. చాగలమర్రి సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద వర్షపు నీరు నిలిచి బాలికల పాఠశాల, పీహెచ్‌సీలోకి వస్తున్నాయని ప్రభుత్వ వైద్యాధికారి అంజలి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, వైస్ ఎంపీపీలు ఆశీర్వాదమ్మ, ముల్లా రఫీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బాలీశ్వరరెడ్డి, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆళ్లగడ్డ: ఏకీకృత పెన్షన్‌స్కీంను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని యూటీఎఫ్ నాయకులు రామనందకిశోర్, ఐజయ్య, సుధాకర్‌రెడ్డి శుక్రవారం తహసీల్దార్ జ్యోతి రత్నకుమారికి వినతి పత్రం అందజేశారు. 2004 జనవరి నుంచి కేంద్రం, 2004 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను తీసుకు వచ్చిందన్నారు. దీనికంటే సీపీఎస్ మెరుగైందన్నారు. మరోరూపంగా కేంద్రం యూపీఎస్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎక్కడా లాభం లేదని కేవలం కార్పొరేట్ షేర్ మార్కెట్‌కు లాభాన్ని చేకూర్చే యూపీఎస్‌ను రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శివారెడ్డి, శ్రీధర్, రహీం, వెంకటేష్, ప్రసన్నకుమార్, చెన్నయ్య, వెంకీ, శ్రీను, సురేంద్ర, హరినాయక్, శివప్రసాద్, లింగప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

నంద్యాల(న్యూటౌన్): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ కోరారు. శుక్రవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ ప్రియదర్శినికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 117వ జీవో ప్రకారం కాకుండా 53వ జీవో ప్రకారం సర్దుబాటు ప్రక్రియ నిర్వహించాలన్నారు. సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. విద్యావలంటీర్ల పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, రామకృష్ణుడు, అరవింద్, కాశీం, సుజాత, రమణ పాల్గొన్నారు.